# నమస్తే తెలంగాణ
# మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 14 జూలై 2024 | MEDAK




రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామ రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

## పాత అలైన్‌మెంట్ ప్రకారం ట్రిపుల్ ఆర్ చేపట్టాలి

### రెడ్డిపల్లి జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

నర్సాపూర్, జూలై 13: పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామ రైతులు శనివారం రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రైతుల రాస్తారోకోతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రిపుల్‌ఆర్ సర్వే కోసం వచ్చిన అధికారులను రైతులు అడ్డుకుని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ... పాత అలైన్‌మెంట్‌ను మార్చి కొత్త అలైన్‌మెంట్‌ను తేవడంతో తమకు నష్టం జరుగుతున్నదని, అలాగే సాగుభూములను తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు, కాళేశ్వరం కాలువ నిర్మాణం కోసం భూములను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని చెరువు నుంచి ట్రిపుల్ నిర్మాణానికి సర్వే చేపడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. గ్రామ శివారులో ఉన్న చెరువులో నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వెళ్తుందని రైతులు తెలపగా, అలాంటి ఏమి లేదన్నారు. రైతులతోపాటు ఆర్డీవో చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ కోసం చేపట్టిన అలైన్‌మెంట్ మారదని, నష్టపరిహారం విషయంలో రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



భూమికి బదులు భూమే ఇవ్వాలని నర్సాపూర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రత్నాపూర్ భూ బాధితులు

## భూములు పోతే రోడ్డున పడతాం

- మీ కాళ్లు మొక్కుతాం.. భూమికి భూమే ఇవ్వండి
- కలెక్టర్ మోకమీదకు రావాలని రైతుల ఆందోళన
- రత్నాపూర్‌లో ట్రిపుల్ఆర్ రోడ్డు సర్వేకు వచ్చిన అధికారులను అడ్డగింత
- భూ బాధితుల ఆగ్రహంతో వెనుదిరిగిన సర్వే అధికారులు

శివ్వంపేట, జూలై 13: 'సారూ.. మీ కాళ్లు మొక్కుతాం... మాకు ఉన్న భూమి మొత్తం ట్రిపుల్‌ఆర్ రోడ్డులో పోతున్నది.. భూమికి భూమే ఇవ్వాలి'.. అని రత్నాపూర్ గ్రామ భూబాధితులు నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. శనివారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం రత్నాపూర్‌లో ట్రిపుల్‌ఆర్ సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకోగా, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా భూ బాధితులు మాట్లాడుతూ.. తామంతా నిరుపేదలమని, ఉన్న భూమి పోతే తాము ఏం సాగుచేసుకొని బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మోకమీదకు వచ్చి తమ మొర వినాలన్నారు. తమకు భూమికి భూమి ఇవ్వాలని, లేకపోతే నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పే వరకు సర్వే అధికారులను సర్వే చేయనీయమని తేల్చి చెప్పారు. దీంతో సర్వే అధికారులు చేసేదేమిలేక వెనుతిరిగారు. అంతకు ముందు భూమికి బదులు భూమి ఇవ్వాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాకున్న ఐదెకరాల భూమి ట్రిపుల్‌ఆర్ రోడ్డులో పోతుందని మస్తు రందైతున్నదని, మొత్తం పొలం రోడ్డులో పోతే మా గతి ఎట్ల కావాలని కర్న కమలమ్మ అనే భూబాధితురాలు ఆర్డీవో కాళ్లమీద పడి ప్రాధేయపడింది. ఆందోళనలో మాజీ ఎంపీటీసీ వాణీరామ్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాలమ్మ, చిక్కుడు బాలేష్, కర్నం రాజు, బొగ్గుల విజయ్, కుమ్మరి వీరేశ్, బుచ్చమ్మ, మానెమ్మ, కమలమ్మ, శంకర్ తదితరులు ఉన్నారు.

**సావే ఇగ దిక్కు..**



నాకు ఒకటిన్నర ఎకరాల పట్టా భూమి ఉంది. నాకు ఇద్దరు పిల్లలు. ఉన్న కాస్త పొలం ట్రిపుల్ ఆర్ రోడ్డులో పోతే నేను ఎట్లా బతకాలి. కుటుంబం అందరం పురుగుల మందు తాగి సావడమే దిక్కు.

– నీరుడి శంకర్, భూబాధితుడు, రత్నాపూర్



సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామికవాడలో గుట్కా సంచులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

## నిషేధిత గుట్కాను రూపుమాపుతాం

బొల్లారం, జూలై 13: నిషేధిత గుట్కాను సమూలంగా రూపుమాపడమే లక్ష్యమని సంగారెడ్డి జిల్లా బొల్లారం సీఐ గంగాధర్ అన్నారు. శనివారం ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా బొల్లారం మండలం పారిశ్రామికవాడలోని జ్యోతినగర్‌కాలనీలోని పలు వ్యాపార సముదాయాల్లో సీసీఎస్ పోలీసులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు వ్యాపార సముదాయాల్లో భారీగా గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దత్తు అనే వ్యాపారి వద్ద రూ.2లక్షలు, రాజేశ్ వద్ద రూ.80వేలు, అంకుర్ అగర్వాల్ వద్ద రూ.70వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్ల స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలు బేఖాతరు చేసి నిషేధిత గుట్కా, పొగాకు, ఖైనీ విక్రయాలు చేపటినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దత్తు అనే వ్యాపారిపై ఇదివరకే రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. పారిశ్రామికవాడలో గుట్కా అక్రమ విక్రయాలపై సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీలో ఎస్సై దశరథ్, సీసీఎస్ టీం సభ్యులు రేఖియానాయక్, శ్రీనివాస్, సిబ్బంది మోతీరామ్, విజయేందర్, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, సంజు, సమ్మయ్య, రవి పాల్గొన్నారు.



అల్లాదుర్గం సబ్‌స్టేషన్ వద్ద 161వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గొల్లకుంట వాసులు

## ఆగ్రహించిన గిరిజనులు

### విద్యుత్ కోతలపై గొల్లకుంటలో రాస్తారోకో

అల్లాదుర్గం, జూలై 13 : తరుచూ విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఆగ్రహించిన తండావాసులు 161వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గొల్లకుంట తండాలో నెల రోజులుగా తరుచూ విద్యుత్ కోతలు విధిస్తుండడంతో తాండా వాసులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు మొర పెట్టుకున్నా పరిష్కరించలేదు. దీంతో తండా వాసులు శనివారం అల్లాదుర్గం సబ్‌స్టేషన్ వద్ద 161వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో అరగంట పాటు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ..రెప్పపాటు కరెంట్ కోతలు ఉండకూడదని ప్రభుత్వం ఆదేశాలను విద్యుత్ అధికారులు బేఖాతరు చేస్తున్నారన్నారు.గొల్లకుంట తండాలో నెల రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, రాత్రిపూట కూడా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజన తం డాలపై అధికారులు చిన్న చూపు చూస్తున్నారన్నా రు. తమ సమస్య పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని తండావాసులు తెలిపారు. ధర్నా విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి తండాలో విద్యుత్ సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో తండా వాసులు ఆందోళనను విరమించారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా

### మెదక్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఉదయ్‌కుమార్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై13: ప్రజల సేవ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా నేరుగా కలువచ్చని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.

# వానలు లేక..ఎవుసం సాగక..

## కానరాని వరుణుడు...కాడె పట్టని రైతులు

- వర్షాకాలం ప్రారంభమై నెలన్నర దాటుతున్నా ఇంకా పొలాలు దున్నని కర్షకులు
- జూన్‌లో మురిపించి జూలైలో అడ్రస్ లేకుండా పోయిన వర్షాలు
- నార్లు పోసి పొలం దున్నేందుకు ఎదురు చూస్తున్న రైతులు
- గతేడాది జూలైలో వరినాట్లతో కళకళ...ఈసారి దున్నని బీళ్లతో వెలవెల
- ఆందోళనలో మెట్ట ప్రాంత రైతన్నలు



హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ శివారులో నారు పోసి పొలం దున్నకుండా వదిలేసిన రైతు

హుస్నాబాద్, జూలై 13: వానకాలం ప్రారంభమై నెలన్నరదాటుతోంది. ప్రారంభంలో కురిసిన వానలకు మురిసిపోయిన రైతులు జోరుగా ఆరుతడి పంటలు సాగు చేసుకున్నారు. అనంతరం వరుణుడు తెరమరుగు కావడంతో సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. గతేడాది జూన్ చివరలో, జూలై మొత్తం పుష్కలంగా వర్షాలు పడటం వల్ల సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లో వరినాట్లు జోరుగా పడ్డాయి. జూలై రెండో వారానికి గ్రామాల్లో ఎక్కడ చూసినా వరినాట్లు పడి పొలాలన్నీ కళకళలాడుతూ కనిపించాయి. చెరువులు, కుంటలు కూడా వర్షపు నీటితో నిండి రైతులు, ప్రజల్లో ధైర్యాన్ని నింపాయి.

**మురిపించి తెరమరుగైన వరుణుడు**

ఈ యేడు జూన్‌లో మురిపించిన వరుణుడు అనంతరం కనిపించక పోవడంతో ఉత్సాహంగా నార్లు పోసిపొలం దున్నేందుకు సిద్ధమైన రైతులకు నిరాశే మిగిలింది. ప్రారంభ వర్షాలకు నార్లు పోసిన రైతులు భారీ వర్షం ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూస్తున్నారు. వరుణుడు కానరాక పోవడంతో కాడి (నాగలి) పట్టేందుకు ముందుకు రావడం లేదు. వరి నారు ముదురుతుంటే ఆందోళకు గురవుతున్నారు. బావులు, బోర్లలో నీళ్లున్న కొందరు రైతులు మాత్రం వరినాట్లు వేసి వరుస తడులతో కాపాడుకుంటున్నారు. ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు మొలకెత్తగా మొలకలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. జూన్ చివర నుంచి జూలై రెండోవారం వరకు వర్షం పడకపోవడంపై రైతులు దిగాలు చెందుతున్నారు. దున్నకుండా బీళ్లుగా ఉన్న పొలాలను చూసి ఆందోళనకు గురవుతున్నారు. వరుణుడు కరుణించి వర్షాలు కురిస్తేనే సాగు ఊపందుకునే అవకాశం ఉంది. మరో పది రోజులపాటు వర్షాలు పడకుంటే నార్లు ఎత్తిపోయి రైతులు నష్టపోతారు.

**జూన్‌లో 21.9, జూలైలో 3.3 సెం.మీ. వర్షపాతం**

ఈ ఏడాది జూన్‌లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 21.9సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జూలై 12వ తేదీ వరకు కేవలం 3.3సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. వర్షకాలంలో అతి ముఖ్యమైన జూలైలో వర్షాలు కురవకపోవడం తీవ్ర నష్టాన్ని మిగిల్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితో రైతులు వరినాట్లు వేశారు. గతేడాది(2023) జూన్‌లో 6.2సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జూలైలో ఏకంగా 10.9 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే గతేడాది జూలైలో రైతులందరూ సాగు చేసుకొని సస్యరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. కానీ ఈసారి జూన్‌లో వర్షం పడి జూలైలో అడ్రస్ లేకుండా పోయింది.

**2023 జూన్, జూలైలో నమోదైన వర్షపాతం వివరాలు**

| మండలం పేరు | జూన్ నెల(మి.మీలో) | జూలై నెల(మి.మీలో) |
|---|---|---|
| అక్కన్నపేట | 46.3 | 117.2 |
| కోహెడ | 52.8 | 48.9 |
| ధూళిమిట్ట | 45.2 | 194.9 |
| హుస్నాబాద్ | 85.4 | 56.7 |
| మద్దూరు | 86.5 | 146.7 |
| బెజ్జంకి | 56.6 | 95.2 |

**ఈ ఏడాది జూన్, జూలైలో నమోదైన వర్షపాతం వివరాలు**

| మండలం పేరు | జూన్ నెల(మి.మీలో) | జూలై నెల(మి.మీలో) |
|---|---|---|
| అక్కన్నపేట | 228.6 | 19.7 |
| కోహెడ | 237.0 | 51.0 |
| ధూళిమిట్ట | 227.0 | 34.7 |
| హుస్నాబాద్ | 210.8 | 22.5 |
| మద్దూరు | 198.7 | 22.0 |
| బెజ్జంకి | 216.1 | 53.6 |

**ఈ ఏడాది జూలై 10వ తేదీ వరకు సాగైన పంటలు**

| మండలం పేరు | వరి | మొక్కజొన్న | పత్తి(ఎకరాల్లో) |
|---|---|---|---|
| అక్కన్నపేట | 267 | 386 | 1553 |
| కోహెడ | 1194 | 165 | 3260 |
| ధూళిమిట్ట | 150 | 214 | - |
| హుస్నాబాద్ | 715 | 190 | 1470 |
| మద్దూరు | 150 | 20 | 1580 |
| బెజ్జంకి | 460 | 270 | 2880 |

**జూలైలో వర్షాలు పడకుంటే నష్టమే..**



వర్షాలు పడకపోవడంతో చాలామంది రైతులు నార్లు పోసుకొని పొలం దున్న డం లేదు. భారీ వర్షం కురిస్తే తప్పా పొ లాలు దున్నేందుకు సిద్ధపడరు. గతేడాది అధిక వర్షాలు పడ్డాయి. గత జూలైలోనే దాదాపు పంటలన్నీ సాగయ్యాయి. కానీ ఈ యేడు జూలైలో తగినంత వర్షం పడక వరి, మొక్కజొన్నలాంటి పంటలు సాగు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెలలో వర్షం సమృద్ధిగా కురవకుంటే నారు పోసుకున్న రైతులు, దుక్కి దున్నుకొని విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– మహేశ్, ఏడీఏ, హుస్నాబాద్

# జీపీల్లో పైసల్లేవ్..!

- జనవరి నుంచి విడుదల కానీ ఎస్ఎఫ్‌సీ, ఎఫ్ఎఫ్‌సీ నిధులు
- పంచాయతీ కార్మికులకు నెలల తరబడి అందని వేతనాలు
- పేరుకుపోతున్న ట్రాక్టర్ కిస్తీలు
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు




మెదక్, జూలై 13 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో పైసల్లేకుండా పోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో జీపీల్లో ఖజానా ఖాళీగా ఉంది. ఓ వైపు ట్రాక్టర్ల కిస్తీలు పేరుకుపోతుండగా, మరో వైపు కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఆదాయం కలిగిన మేజర్ గ్రామ పంచాయతీలను మినహాయిస్తే చిన్న గ్రామ పంచాయతీల్లో పాలన పంచాయతీ కార్యదర్శులకు పెను భారంగా మారుతోంది. అత్యవసరమైన పారిశుధ్యం, తాగునీటి అవసరాల కోసం కార్యదర్శులు తమ జేబుల నుంచి డబ్బులను సర్దుబాటు చేస్తున్నప్పటికీ నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో వారు కూడా చేతులెత్తేస్తున్నారు.

**గడువుకు ముందే ఖజానా ఖాళీ...**

సర్పంచ్‌ల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. అయితే తమకు రావాల్సిన బిల్లులకు సంబంధించి ఖజానాలో ఉన్న డబ్బులను సర్పంచ్‌లు ఖాళీ చేశారు. సాధారణంగా పంచాయతీల్లో పన్నులను మార్చి నెలాఖరులో వసూలు చేస్తారు. పాలకవర్గాల పదవీ కాలం ముగియనుండటంతో మెజార్టీ గ్రామాల్లో ఈసారి ముందుగానే పన్నులు వసూలు చేశారు. వచ్చిన పన్నులను పంచాయతీ అవసరాలకు ఖర్చుచేశారు. కొంత మంది సర్పంచ్‌లు పంచాయతీ అవసరాల కోసం వెచ్చించిన సామగ్రికి సంబంధించి బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నారు. మరికొందరి బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడంతో ట్రెజరీ చుట్టూ తిరుగుతున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారు వారంలో ఒక సారి కూడా జీపీలను సందర్శించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పంచాయతీల్లో బాధ్యత మొత్తం కార్యదర్శులపై పడుతోంది.

**పల్లెపాలనకు ఇబ్బందులు**

మెదక్ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీల్లో ఆదాయం కలిగిన కొన్ని పంచాయతీలను మినహాయిస్తే 500లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో పాలనకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు మూడు, నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నీటి సరఫరా, పారిశుధ్య కార్మికులు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులు జేబుల నుంచి వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. పంచాయతీల్లో వీధిదీపాల బిల్లుల చెల్లింపు, తాగునీటి పథకాల నిర్వహణ, మోటార్ల మరమ్మతు వంటివి అత్యవసర పనుల కోసం కూడా కార్యదర్శులు సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు ఒక్కో గ్రామ పంచాయతీలో రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు, మేజర్ గ్రామ పంచాయతీలు అయితే రూ.5 లక్షల వరకు వివిధ పనుల నిమిత్తం ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

**ప్రతి నెలా రూ.8 కోట్ల నిధులు విడుదల**

జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి నెలా రూ.8 కోట్ల వరకు నిధులు విడుదలవుతాయి. వీటికి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను(ఎస్ఎఫ్‌సీ) ప్రభుత్వం ప్రతి నెలా విడుదల చేసేది. కేంద్రానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు (ఎఫ్ఎఫ్‌సీ) ప్రతి మూడు నెలలకోసారి విడుదల చేసేది. ఐదు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన నిధులు విడుదల కాలేదు. దీంతో పంచాయతీల్లో ఎలాంటి పనులు చేపట్టలేని పరిస్థితి దాపురించింది.

**బకాయిలు ఉన్నది వాస్తవమే..**




పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు ఉన్న మాట వాస్తవమే. జనవరి నుంచి జూన్ వరకు నిధులు విడుదల కాలేదు. రోజూ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీలకు రూ.8 కోట్ల వరకు నిధులు విడుదలవుతాయి. ఐదు నెలలుగా నిధులు విడుదల కాక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– యాదయ్య, డీపీవో మెదక్ జిల్లా

## పక్కా భవనాలకు మోక్షమెప్పుడో?

- అద్దె భవనాల్లోనే సర్కారు కార్యాలయాలు
- అరకొర సదుపాయాలతో ప్రజల అవస్థలు
- సిబ్బందికి తప్పని ఇబ్బందులు

రాయపోల్, జూలై 13 : సర్కారు కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో..రేకుల షెడ్లలో సరైన సదుపాయాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం,వేసవి వస్తే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు అందని ద్రాక్షలానే మిగిలిపోతోంది. ఐదు దశాబ్దాలుగా రాయపోల్ మండలం ఏర్పాటుకు కోసం ప్రజలు పోరాటం చేస్తే 2017 అక్టోబర్ 12న కల సాకారమైంది. దౌల్తాబాద్ మండలం నుంచి విడిపోయి 13 గ్రామ పంచాయతీలతో కొత్త మండలంగా ఏర్పడింది. 2019లో కొత్త గ్రామపంచాయతీల పునర్విభజన జరిగింది. తర్వాత మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. మండలంలోని శాంతిభద్రతలు పరిరక్షించే పోలీస్ స్టేషన్ సైతం ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్నది. నాలుగు గదుల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. కనీసం లాకప్ ఏర్పాటు చేసుకోలేకపోడంతోపాటు వివిధ వస్తువులు, రికార్డులు భద్రపర్చేందుకు సరైన గదులు లేక పోలీసు సిబ్బందికి ఇబ్బందిగా మారింది. సెర్ప్ కార్యాలయం కూడా వదిలేసిన పాఠశాల భవనంలోనే కొనసాగుతున్నది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల కోసం ఒకేచోట ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నా ప్రభుత్వ అధికారులు ఆదిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మండల తహసీల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన పాఠశాలలో, ఎంపీడీవో కార్యాలయానికి కూడా సొంత భవనం లేక రేకులషెడ్‌లో కొనసాగుతున్నది. కనీస వసతులు లేక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న మండలాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చూసింది. ఇందులో భాగంగానే రాయపోల్ మండలం ఏర్పడినప్పటికీ ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల తహసీల్ కార్యాలయం



రేకుల షెడ్‌లో కొనసాగుతున్న రాయపోల్ మండల ఎంపీడీవో కార్యాలయం



అదనపు కోర్టులను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు మాధవీదేవి,అనిల్‌కుమార్

## అదనపు కోర్టులు ప్రారంభం

సంగారెడ్డి, జూలై 13: జిల్లా కోర్టు ప్రాంగణం కోర్టుల్లో కక్షిదారులు వేసిన కేసులను త్వరగా పరిష్కరించేందుకు అనుకూలంగా రెండు అదనపు కోర్టులను న్యాయమూర్తులు ప్రారంభించారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు అసిస్టెంట్ సెషన్ కోర్టులను హైకోర్టు న్యాయమూర్తి అనిల్‌కుమార్, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి మాధవీదేవి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర, కలెక్టర్ వల్లూరి క్రాంతి హాజరై నూతన కోర్టులను ప్రారంభించారు. సంగారెడ్డికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులకు ఘనస్వాగతం పలికేందుకు కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేశ్ ప్రభుత్వ అతిథిగృహానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తులు పట్టణంలోని శ్రీవైకుంఠపురంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కోర్టులోని బార్ అసోసియేషన్ గ్రంథాలయాన్ని సందర్శించారు. న్యాయవాదులకు ఉచిత భోజనశాలను సందర్శించి అధ్యక్షుడిని అభినందించారు. న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు సానుకూలంగా స్పంది స్తూ తమ వంతు సహాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సూరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంబరీష్, సంయుక్త కార్యదర్శి రమేశ్‌రాజ్, సభ్యులు మాధవి, అశోక్, ఆంజనేయులు, రమాదేవి, విజయ్, వినోద్, నిజాముద్దీన్, లలిత, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.